## ఆరోగ్యకర సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి




**మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆరోగ్యకర సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్యంగా ఉంటే అంతకు మించిన సంపదలేదని మన చేతుల్లో మన ఆరోగ్యం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రాణం ఉన్నంతవరకు ప్రాణాయామాలు చేద్దామని, అవయవాలు ఉన్నంతవరకు ఆసనాలు వేద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 7 వ తేదీ నుండి 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పలు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇందులో భాగంగా ఈనెల 7 వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు మంగినపూడి బీచ్ లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు అని ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే ఈ నెల 10వ తేదీన ఉదయం 7 గంటలకు గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో లారీ, ఆటోసంఘాల ప్రతినిధులతో కలుపుకొని యోగ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 16వ తేదీన ఉదయం 7 గంటలకు ప్రముఖ నాట్య క్షేత్రమైన మొవ్వ మండలం కూచిపూడి లోని శ్రీ సిద్ధేంద్ర కళాక్షేత్రంలో కూడా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 21వ తేదీన ఉదయం 7 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవం జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఉయ్యూరులోని శ్రీ విశ్వశాంతి పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఒక్కో మాస్టర్ ట్రైనర్ ద్వారా యోగ పై ఆసక్తి ఉన్న 50 మంది ప్రజలకు యోగా శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ప్రజాప్రతినిధులు, ప్రజలు విరివిగా పాల్గొని యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## విద్యార్థులు తమ పేరుపై బ్యాంకు ఖాతాలను అత్యవసరంగా ప్రారంభించుకోవాలి

**మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం కింద ఆర్థిక సహాయం త్వరలో విడుదలయ్యే అవకాశం ఉన్నందున, 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్సీ విద్యార్థులు తమ పేరుపై బ్యాంకు ఖాతాలను అత్యవసరంగా ప్రారంభించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు సూచించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం చదువుతున్న అర్హులైన విద్యార్థులందరూ ప్రభుత్వ పథకం ప్రయోజనాలు పొందాలంటే తప్పనిసరిగా తమ పేరుపై బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని తెలిపారు. ఇప్పటివరకు బ్యాంకు ఖాతా లేని విద్యార్థులు సమీపంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) లేదా పోస్టాఫీస్‌ను సంప్రదించి వెంటనే ఖాతా ప్రారంభించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఖాతా ప్రారంభించిన అనంతరం ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ ( ఎన్పీసీఏ) లింకింగ్ ప్రక్రియలను కూడా పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్ అనుసంధానం మరియు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పూర్తయిన విద్యార్థుల ఖాతాల్లోకే "తల్లికి వందనం" పథకం కింద ఆర్థిక సాయం నేరుగా జమ చేయబడుతుందని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని షేక్ షాహిద్ బాబు కోరారు.



## కంచికచర్లలో ఘోర ప్రమాదం...



**నందిగామ జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పరిటాల గ్రామం నుంచి కంకర లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కంచికచర్ల మండలంలోని పరిటాల గ్రామ పరిసరాల్లో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం కంకర లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రతకు బైక్ పూర్తిగా ధ్వంసమైంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు విషాదంలో మునిగిపోయారు. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

## చందర్లపాడులో ట్రాక్టర్ బోల్తా...



**నందిగామ జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలో శనివారం మట్టి లోడుతో వస్తున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ముప్పాళ్ల గ్రామం వైపు నుంచి మట్టి లోడుతో వస్తున్న ట్రాక్టర్ చందర్లపాడులోని జామ తోట సమీపానికి చేరుకోగానే ఒక్కసారిగా అదుపు తప్పింది. దీంతో రోడ్డు మార్జిన్ కిందకు దూసుకెళ్లిన ట్రాక్టర్ బోల్తా కొట్టింది. ప్రమాద సమయంలో ట్రాక్టర్‌లో డ్రైవర్ ఒక్కడే ఉండగా, అదృష్టవశాత్తు అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాక్టర్ బోల్తా పడటంతో కొంతసేపు ఆ ప్రాంతంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాదానికి అతివేగం, రోడ్డు పక్కన ఉన్న మట్టి మార్జిన్ లేదా డ్రైవర్ నిర్లక్ష్యం కారణమై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. చందర్లపాడు మండలం నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది.

## మూతబడిన ఇసుక ర్యాంపు తరవాలి... సీఐటీయూ




**ఆచంట జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సిద్ధాంతం గ్రామంలో మూతబడిన ఇసుక ర్యాంపును వెంటనే తెరవాలని సీఐటీయూ నాయకులు ఆదివారం నిరసన చేపట్టారు. ర్యాంపు మూసివేయడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని, ప్రతి కుటుంబం ఇసుక ర్యాంపుపై ఆధారపడి జీవిస్తోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాంపును తెరిచి ప్రతి కుటుంబానికి పని కల్పించాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

## బొబ్బిళ్లపాడులో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత...



**నందిగామ జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం బొబ్బిళ్లపాడు గ్రామంలో పౌర సరఫరాల శాఖ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు గ్రామంలోని ఓ ఇంటిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, భారీ మొత్తంలో ప్రభుత్వ రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. తనిఖీలలో మొత్తం 115 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 230 బస్తాలు బయటపడగా, వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా సేకరించి నిల్వ ఉంచినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు ఘటనకు సంబంధించి బాధ్యుడిపై అత్యవసర వస్తువుల చట్టం (జుంంవత్ఋశ్రీ జశీఎశీఅఉఅవం ాాఏ) కింద 6ఏ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సంబంధిత గోదాముకు తరలించి తదుపరి విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని దుర్వినియోగం చేయకుండా ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## గిరిజన యువతకు మెరుగైన అవకాశాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే



**కొత్తూరు జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గిరిజన యువతకు మెరుగైన అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కొత్తూరు మండల కేంద్రంలో రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జీసీసీ ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, స్థానిక ప్రజలకు ఉపాధి కల్పన, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ఇటువంటి సంస్థలు చేస్తున్న సేవల అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుతో కొత్తూరు మండల ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలు అందుబాటులోకి రావడం సహా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదు: మంత్రి నిమ్మల



**పాలకొల్లు జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వైకాపా అధినేత జగన్‌కు డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పాలకొల్లు మండలంలో రూ.2.35 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో రెండు మూడు డీఎస్సీలు అని చెప్పిన జగన్.. మాట తప్పి నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని.. ఐదేళ్లలో ఒక్కటి కూడా విడుదల చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీపై చేసి ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. డీఎస్సీ నోటిఫికేషన్‌తోపాటు ఉపాధ్యాయ నియామకాలను భర్తీ చేశామన్నారు. డీఎస్సీకి ఎంపికైన ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి తమ ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే అసత్య ప్రచారాలతో వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పాముల రజిని కుమార్, ఉన్నమట్ల కబర్ధి, కలిదిండి రామరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కేంద్రమంత్రి, ఎమ్మెల్యే



**వట్టి చెరుకూరు జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో తారు రోడ్డు నిర్మాణానికి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బోర్ల రామాంజనేయులు ఆదివారం శంకుస్థాపన చేశారు. గుంటూరు నగరానికి సమీపంలోని 16వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ రూ.6.7 కోట్లతో ఈ రోడ్డు నిర్మించనున్నారు. రహదారి నిర్మాణాన్ని ఆరు నెలల్లో పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి 2019లో సీఎం చంద్రబాబు రూ.3.50 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తుచేశారు. మళ్లీ ఆయన హయాంలోనే రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

## కంచికచర్ల (మ)నక్కలంపేటలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం ...



**నందిగామ జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కంచికచర్ల మండలం నక్కలంపేట గ్రామంలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. కిచెన్ డోర్ పగలగొట్టి ఇంట్లోకి చొరబడిన దొంగలు 394 గ్రాముల బంగారం, రూ. 50,000 నగదును అపహరించుకుపోయారు. ఉదయం కుటుంబ సభ్యులు ఈ దారుణాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ వైవిఎల్ నాయుడు, ఎస్ఐ విశ్వనాథ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం గాలింపు ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## గుత్తి ఆర్టీసీ బస్టాండులో సెల్ఫోన్ చోరీ



**గుత్తి జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుత్తి ఆర్టీసీ బస్టాండ్లో అనంతపురంకు చెందిన మోహన్ అనే ప్రయాణికుడి రూ. 40 వేల విలువైన సెల్ ఫోన్ చోరీకి గురైంది. యాడికి నుంచి తిరిగి గుత్తి బస్టాండ్కు వచ్చిన మోహన్, అనంతపురం బస్సు ఎక్కే సమయంలో ఈ సంఘటన జరిగింది. దుండగులు అతని జేబులోంచి ఫోన్ ను దొంగిలించి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## మంత్రి సవితను సన్మానించిన అనంతపురం ఎమ్మెల్యే



**గుంతకల్లుజూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదివారం అనంతపురంలో వ్యక్తిగత కార్యక్రమం నిమిత్తం పర్యటించారు. ఈ సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి తన కార్యాలయానికి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు మంత్రి టిడిపి కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జిల్లా టిడిపి అధ్యక్షులు నాగరాజు మంత్రిని సన్మానించారు.

## బాలాజీ నగర్ లో కార్డెన్ సర్చ్

**ఒంగోలు జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రకాశం జిల్లా ఒంగోలు టూ టౌన్ పరిధిలోని బాలాజీనగర్, బత్తులవారికుంటలో ఆదివారం డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 40 మంది పోలీస్ సిబ్బంది ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి, పాత ముద్దాయిల నివాసాలలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ధ్రువీకరణ పత్రాలు లేని రెండు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

## జిల్లా కోర్టు సెంటర్‌లో అగ్నిప్రమాదం



**మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలోని జిల్లా కోర్టు సెంటర్ సమీపంలో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కోర్టు సెంటర్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది. మంటల కారణంగా దట్టమైన పొగలు వ్యాపించి చుట్టుపక్కల నివాస ప్రాంతాలను కమ్మేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగల వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడటంతో పాటు కొంతసేపు ఆ ప్రాంతంలో రాకపోకలు కూడా అంతరాయం కలిగాయి. అగ్నిప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ సిబ్బంది వేగంగా స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు స్థానికులు తెలిపారు.ప్రజలు అసలే నగరంలో తీవ్ర ఎండలతో సతమతమవుతున్నారు. అయితే చెత్తాచెదారానికి ఎలా మంటలు అంటుకున్నాయనే విషయంపై స్పష్టత రాలేదు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

## గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



**మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం మండలం పోతేపల్లి పంచాయతీ ఉల్లిపాలెం గ్రామంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో హిందూ స్మశాన వాటికలో మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు కమ్మిలి మధు చొరవతో మైత్రి ఫౌండేషన్ సంస్థ వారు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయం అన్నారు. జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్ టీడీపీ మండల అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇన్ ఛార్జులు తలారి సోమశేఖర్ , కాగిత గోపాలరావు కమ్మిలి మధు, శ్రీపతి చంద్రం కాగిత శేష ,లింగం విజయ్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## శంఖవరం ఆలయ మహోత్సవాలు



**బద్వేల్ జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కడప జిల్లా కలసపాడు మండలం శంఖవరం గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ సమేత శ్రీ రామచంద్ర స్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయ మహోత్సవాలు 41 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా, బద్వేల్ నియోజకవర్గ వైఎస్సార్సీపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ్ రెడ్డి, వైఎస్సార్సీపీ నేతలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామ ప్రజలతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి.

## జూన్ 8న కలెక్టరేట్‌లో సమస్యల పరిష్కార వేదిక



**కడప జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కడప జిల్లా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల విచారణను వినియోగించుకోవాలని డీఆర్వో మల్లికార్జునుడు సూచించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలు స్వీకరించబడతాయి. పాత అర్జీదారులు గత రసీదులను తీసుకురావాలి. ఉదయం 9:30 నుండి 10 గంటల మధ్య 08562-244437 నంబర్‌కు కాల్ చేసి కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. వీవవనిశీయిఎ. ఖజూ. స్రశీజ. అఅ లో లేదా 1100 కు డయల్ చేసి కూడా అర్జీలను సులభంగా నమోదు చేసుకోవచ్చు.

# మచిలీపట్నం పై రైల్వే శాఖ నీలి నీడలు

## ఎంపీజీ జర చూడండి.!



**మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కోట్ల రూపాయలతో మచిలీపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పరుస్తూ మరోపక్క ప్రయాణికులు వసతులు పై రైల్వే శాఖ నిర్లక్ష్యంపై మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ తీవ్రంగా ఖండించారు. మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ ఎంతో కాలంగా మచిలీపట్నం బీదర్ హైదరాబాద్ మీదగా వెళ్లే సూపర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కు గతంలో ఉన్న 14 స్లీపర్ భోగిలను ఏడు బోగీలు తగ్గించటం ఎంతవరకు సమంజసం అని బాలాజీ ప్రశ్నించారు. అదనపు ఆదాయం కోసం ఏసీ కోచ్ లు ను పెంచి మధ్యతరగతి ప్రయాణికులకు అందుబాటులో ఉన్న ఏడు స్లీపర్ భోగీలు తగ్గించడం వలన ప్రతిరోజు 500 మంది ప్రయాణికులకు ప్రయాణ అవకాశాలు లేకుండా పోయిందని బాలాజీ అన్నారు. జిల్లా ముఖ్య కేంద్రంలో అదనపు రైలు ఏర్పాటు చేయవలసి ఉండగా అమల్లో ఉన్న రైలుకు భోగిలను తొలగించడం ఏకపక్ష చర్యని బాలాజీ విమర్శించారు. విశాలమైన పొడుగు ప్లాట్ఫారాలు నిర్మించి మచిలీపట్నం నుంచి ఎంతో కాలంగా ఉన్న హైదరాబాదు బీదర్ రైలుకు 7 స్లీపర్ భోగీలు తగ్గించడం రైల్వే అధికారుల నిర్లక్ష్యం అని బాలాజీ అన్నారు. తక్షణమే హైదరాబాద్ బీదర్ ట్రైన్ కు తొలగించిన ఏడు స్లీపర్ భోగీలనుతిరిగి ఏర్పాటు చేయాలని, మచిలీపట్నం -తిరుపతి రైలు తక్షణమే అందుబాటులో తీసుకురావాలని కూడా బాలాజీ డిమాండ్ చేశారు. కేంద్ర పరిధిలో గల రైల్వే శాఖ మంత్రితో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాల సౌరి మాట్లాడి మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు రైల్వే అధికారులు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించాలని బాలాజీ కోరారు.

## ఆరోగ్యపరమైన నిర్మాణానికి యోగా చక్కని సాధనం -మంత్రి కొల్లు రవీంద్ర.




**మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని, సుసంపన్నమైన, ఆనందమయమైన ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం-2026 వేడుకల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం మంగినపూడి బీచ్‌లో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో పాల్గొని యోగా ఆసనాలు చేశారు. కార్యక్రమంలో మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని) తదితరులు పాల్గొని యోగా ప్రియులను ఉత్సాహపరిచారు. బీచ్ ఒడ్డున పచ్చని తివాచీపై యోగ అనే ఆంగ్ల అక్షరాలతో ఏర్పాటు చేసిన అక్షరాకృతులలో కూర్చోబెట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక నుండి యోగా శిక్షకులు రెబ్బా పోతన శాస్త్రి సూచనలు చేస్తూ ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం వారి చేత యోగాసనాలు వేయించి అందరి చేత యోగ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రాగి జావా, తాగునీరు అందించారు. మంత్రి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో యోగాకు విశిష్ట స్థానం ఉందన్నారు. 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. గత ఏడాది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నారని, విశాఖపట్నం సముద్రతీరంలో ప్రధానమంత్రి సమక్షంలో సుమారు ఐదున్నర లక్షల మందికి పైగా ఒకేసారి యోగాసనాలు చేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. ఈ ఏడాది కూడా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగినపూడి బీచ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై యోగాలో పాల్గొనడం సంతోషకరమన్నారు. రోజువారీ జీవితంలో ఏకాగ్రత పెరగడం, ఒత్తిడి తగ్గడం, శరీరానికి చురుకుదనం రావడం వంటి అనేక ప్రయోజనాలు యోగా ద్వారా లభిస్తాయని వివరించారు. ప్రస్తుతం పెరుగుతున్న మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి సంబంధిత వ్యాధులను నియంత్రించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు కూడా యోగా ఎంతో ఉపయోగకరమన్నారు. ముఖ్యంగా మహిళలు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు.

### యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి -- జిల్లా కలెక్టర్.



**మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమం ఒకరోజు నిర్వహించే సాధారణ కార్యక్రమం కాదని, ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు చేపట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద నివారణ ఆరోగ్య (ప్రివెంటివ్ హెల్త్) ఉద్యమమని తెలిపారు. ప్రస్తుతం దేశంలో మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు జీవనశైలిలో మార్పులు అవసరమని పేర్కొన్నారు. యోగా కీలక పాత్ర పోషిస్తుందని, క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే మధుమేహం, బీపీ వంటి సమస్యలు అదుపులోకి రావడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. యోగా ద్వారా ప్రజలు మరింత చురుకుగా, ఉత్సాహంగా జీవించగలరని వివరించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఈ ఒక్క రోజుతో పరిమితం కాకుండా యోగా సాధనను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ కోరారు. వృద్ధులకు యోగా అత్యంత అవసరం ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. యోగా అనేది ఆరోగ్య సమస్యలు వచ్చిన తర్వాత చికిత్స పొందే విధానం కాదని, రోగాలు రాకుండా ముందుగానే నివారించే ఉత్తమ సాధనమని పేర్కొన్నారు. గతంలో కూడా యోగా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ, చాలామంది యోగాను నిరంతరంగా కొనసాగించలేకపోతున్నారని అన్నారు. యోగాను ప్రతిరోజూ సాధన చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడి అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన వృద్ధులకు యోగా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ఇంటి వద్దే యోగా సాధన ద్వారా ఆరోగ్యంగా, చురుకుగా జీవించవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, యోగాను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా జీవితంలో భాగంగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యోగాతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ యోగా మనిషికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను అందించే గొప్ప సాధనమని అన్నారు. జీవించవచ్చని పేర్కొన్నారు. చివరిగా, యోగా గురువులు రెబ్బా పోతన శాస్త్రి, ఘంటసాల గురునాథ బాబు, కే చందు, శాస్త్రిలను మంత్రి, జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, బందరు ఆర్డిఓ కే సాంబశివరావు, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డిపిఓ ధనలక్ష్మి, ఆయుష్ శాఖ అధికారులు డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ వాహిని, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, పర్యాటకశాఖ అధికారి రామ్ లక్ష్మణరావు, తదితర శాఖల జిల్లా అధికారులు, యోగా గురువులు శేష ప్రసన్న, మద్దాల చింతయ్య, శీలం రమేష్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, ఉద్యోగులు, స్థానిక నాయకులు, ఏపీ యోగసభ సభ్యులు, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలు,యువత తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాలో భారీగా చేరికలు



**అయ్యన్నపేట జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలోని 44వ డివిజన్ అయ్యన్నపేటలో వైకాపాకు ఎదురు దెబ్బ తగిలింది. సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ నడుపూరు వెంకటరమణ ఆధ్వర్యంలో సుమారు 250 కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. ఈ మేరకు ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పార్టీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి తెదేపాలోకి ఆహ్వానించారు. నియోజక వర్గంలో తెలుగు దేశం పార్టీకి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. విజయనగరం మండలం దుప్పాడ గ్రామంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఉచిత బాక్సింగ్ శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. క్రీడల్లో పాలుపంచుకోవడంతో పిల్లల్లో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఒత్తిడి తగ్గి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత పెరుగుతాయన్నారు. క్రీడలతో పాటు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## ఇబ్రహీంపట్నంలో రౌడీ షీటర్లకు సిఐ కౌన్సిలింగ్



**మైలవరం మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో చెడు నడత కలిగిన వ్యక్తులకు, సిఐ సుబ్రహ్మణ్యం కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు, అనుమానిత షీటర్లు గంజాయి సేవించే అలవాటును మానుకోవాలని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని, మంచిగా జీవించాలని సూచించారు. విరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సహాయం త్వరలో విడుదల .......

### సాంఘిక సంక్షేమ శాఖ అధికారి.

**మచిలీపట్నం జూన్07 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం కింద ఆర్థిక సహాయం త్వరలో విడుదలయ్యే అవకాశం ఉన్నందున, 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్సీ విద్యార్థులు తమ పేరుపై బ్యాంకు ఖాతాలను అత్యవస రంగా ప్రారంభించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు సూచించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం చదువుతున్న అర్హులైన విద్యార్థులందరూ ప్రభుత్వ పథకం ప్రయోజనాలు పొందాలంటే తప్పనిసరిగా తమ పేరుపై బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని తెలిపారు. ఇప్పటివరకు బ్యాంకు ఖాతా లేని విద్యార్థులు సమీపంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) లేదా పోస్టాఫీస్‌ను సంప్రదించి వెంటనే ఖాతా ప్రారంభించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఖాతా ప్రారంభించిన అనంతరం ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఐ ( ఎన్పీసీఏ) లింకింగ్ ప్రక్రియలను కూడా పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్ అనుసంధానం మరియు ఎన్‌పీసీఐ మ్యాపింగ్ పూర్తయిన విద్యార్థుల ఖాతాల్లోకే "తల్లికి వందనం" పథకం కింద ఆర్థిక సాయం నేరుగా జమ చేయబడుతుందని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని షేక్ షాహిద్ బాబు కోరారు.

## నగరంలో రెచ్చిపోతున్న "పెట్రోలు" దొంగలు



**విజయవాడ, జూన్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ నగరంలో పెట్రోల్ దొంగలు రెచ్చిపోతున్నారు. నున్న పోలీసు స్టేషన్ పరిధిలోని నగర శివారు ప్రాంతాలైన సుందరయ్య నగర్, విశాలాంధ్ర కాలనీలో వరుస పెట్రోల్ చోరీ ఘటనలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోలు చోరీ చేస్తున్న వైనం.. పెట్రోలు ధరలు పెరిగి నానా బాధలు పడుతున్న ప్రజలకు గోరుచుట్టు మీద రోకలి పోటులా పెట్రోలు దొంగతనాలు వాహనదారులకు పెట్రోలు దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పెట్రోల్ లాక్ లు వేయించుకున్నా లాభం లేదనీ దొంగలు వాహనాలు ధ్వంసం చేస్తున్నారన్నారు. పోలీసులు రాత్రి పూట పెట్రోలింగ్ పెంచి చోరీలు నివారించాలని వాహన యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత పోలీసు ఉన్నత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి సిద్ధాంతం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



**భీమవరం జూన్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జూన్ 8వ తేదీ సోమవారం పెనుగొండ మండలం సిద్ధాంతంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ప్రధాన భూపరిపాలన కమిషనర్ జి. జయలక్ష్మి తదితరులు పరిశీలించారు.

## పెదకాకానిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ శిక్షణ తరగతులు



**పొన్నూరు జూన్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా, పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జూన్ 8 నుండి 21 వరకు ప్రతిరోజూ ఉదయం 7 నుండి 8 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించబడతాయి. జూన్ 21న సామూహిక యోగా కార్యక్రమం ఉంటుందని ఉపకమీషనర్ గోగినేని లీలాకుమార్, ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు ఆదివారం తెలిపారు. పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com